క్లుప్తంగా

జాతీయ బాలల సైన్స్ పోటీలకు ఎంపిక

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి వర్షిత్, భాను తేజలు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో 'డిఫారెస్టేషన్' అనే ప్రాజెక్టును ప్రదర్శించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ తెలిపారు. వీరికి శుక్రవారం విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన పోటీల్లో డీఈవో రాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచరుగా శ్రీనివాస్, మాధురి వ్యవహరించారు. పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరు నుంచి ఇద్దరు విద్యార్థులు..



భిక్కనూరు: రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు శనివారం ఎంపికయ్యారు. భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్ఫూర్తిరెడ్డి, వైష్ణవిలు యాంటిబయాటిక్స్ వినియోగం, దుష్ప్రభావాలపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. కామారెడ్డిలో వీరు ప్రదర్శించిన పవర్ ప్రాజెక్టు పలువురి మన్ననలను పొందింది. వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా మందులు వాడితే కలిగే ఇబ్బందుల గురించి ఈ విద్యార్థులు ప్రదర్శించిన పవర్ ప్రాజెక్టు ఆకర్షించింది. ఈ విద్యార్థులకు ప్రశంస పత్రాలను సర్టిఫికెట్లను అందించారు. గైడ్ చేసిన సైన్స్ ఉపాధ్యాయులు సరిత, తమ్మల రాజులను అభినందించారు.

బీఎంఎస్ అనుబంధ ఆటో యూనియన్ కమిటీ రద్దు



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్)కు అనుబంధంగా ఉన్న కామారెడ్డి జిల్లా ఆటో యూనియన్ కమిటీని పూర్తిగా రద్దు చేసినట్లు బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. యూనియన్‌లో పని చేసిన, స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోదాసు నర్సింలుకు బీఎంఎస్‌తో ఎలాంటి సంబంధం లేదన్నారు.

సంఘ సేవకులకు సన్మానం



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, మహిళా ప్రతినిధి షబానా బేగంలను హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్, బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి సమావేశంలో ఉత్తమ సంఘ సేవకులుగా వారిని ప్రశంసాపత్రాలతో సన్మానించింది. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సోనుసింగ్ భరత్, ఉపాధ్యక్షుడు ఎండీ సాయిల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంప్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 10 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్, సీఆర్‌పీ హైమద్ పాష తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శివలింగ్ నవీన్ కొద్ది రోజుల క్రితం ఫోన్ పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫోన్ ఆచూకీని కనిపెట్టి శుక్రవారం ఆయనకు ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

ఉండమ్మా బొట్టు పెడతా!



కామారెడ్డి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సీఎం కేసీఆర్ తరఫున బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి సీఎం కేసీఆర్‌కే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కల్కినగర్‌లోని బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

- నన్ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుట్ర పన్నుతున్నాయి
- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు



కాంగ్రెస్‌లో చేరుతున్న వైస్ ఎంపీపీ రవీందర్‌రావు



కొండాపూర్‌లో స్వాగతం పలుకుతున్న మహిళలతో కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్

రాజంపేట: నవంబర్ 30న జరగనున్న ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి నియోజవర్గం గ్రామాలైన సిద్దాపూర్, ఎల్లాపూర్ తండా, నడిమి తండా, గుండారం, ఎల్లారెడ్డిపల్లి, కొండాపూర్, ఆర్గొండ, అన్నారం, బసవన్నపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మదన్మోహన్‌కు బోనాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. కొండాపూర్‌లో ఆయన మాట్లాడుతూ...తాను అధికారంలో లేకున్నా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. తనను ఓడించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ప్రజా అభిమానం ముందు ఏ కుట్రలు పని చేయవని తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎల్లారెడ్డి నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): వైస్ ఎంపీపీ రవీందర్‌రావుతో పాటు గిద్ద ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్, రామారెడ్డి ఎంపీటీసీ భాగ్యలక్ష్మీ శ్యాం, కన్నాపూర్ ఉపసర్పంచ్ అంజల్‌రెడ్డి, గిద్ద మాజీ ఎంపీటీసీ నారాయణ, తదితరులు అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఎల్లారెడ్డిలో నేతల ప్రచారం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి మదన్‌మోహన్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు విద్యాసాగర్, వినోద్‌గౌడ్, భూమయ్య తదితరులున్నారు.

అధికారంలోకి రాగానే వరికి రూ.3,100 ఇస్తాం



గాంధారిలో ప్రచారం చేస్తున్న సుభాష్ రెడ్డి



ప్రచారం చేస్తున్న సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): బీజేపీ అధికారంలోకి రాగానే క్వింటాల్ వరికి రూ.3100 చెల్లిస్తామని ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ అమలు చేసే పథకాల గురించి వివరించారు. వడ్డేపల్లి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వాడుకుని, కరివేపాకు మాదిరిగా టికెట్లు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ బీఆర్‌ఎస్ పార్టీలో మంత్రి బంధువని, ఆయను గెలిపిస్తే సురేందర్ లాగే బీఆర్‌ఎస్ పార్టీకి అమ్ముడు పోతారని వ్యాఖ్యానించారు. కమలం పువ్వుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు.

వడ్డేపల్లి కుటుంబసభ్యుల ప్రచారం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని సుభాష్‌రెడ్డి సతీమణి విద్యారాణి, కూతురు దివ్య, కోడలు నవీన, స్థానిక నేతలు అఫీజ్, నవీన్ తదితరులు కోరారు.

దోచుకుంటున్న వారి నుంచి విముక్తి కల్పించాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కామారెడ్డి అర్బన్/కామారెడ్డిటౌన్: గ్రామాల్లో వాడవాడలా మద్యం, బెల్ట్‌షాపులు పెట్టి ప్రజలను మద్యం బానిసలుగా చేసిన కేసీఆర్‌కు నవంబర్ 30న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, 20 ఏళ్లుగా కామారెడ్డిని దోచుకుంటున్న వారి నుంచి విముక్తి కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణం, దేవునిపల్లి శివారు కాలనీల్లో బీజేపీ తరఫున ప్రచారం చేశారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలుపు ఖాయమైందని, అధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. నాయకులు కాసర్ల రాజలింగం, తుమ్మ బాల్‌కిషన్, సీహెచ్ రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అబ్బాయిని నమ్మకండి



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల



ప్రచారంలో పోతరాజుల విన్యాసాలు

- ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్



కరడ్‌పల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మదన్ మోహన్ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను అంగట్లో గొర్రెలను కొన్నట్లు కొంటుండని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆరోపించారు. శుక్రవారం సదాశివనగర్ మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని సూచించారు. అమెరికాలో ఉండే అబ్బాయిని నమ్మొద్దన్నారు. తక్కువ సమయంలో తాను నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా ప్రజలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రవి, ఎంపీటీసీ బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో బీఆర్‌ఎస్ నేతల ప్రచారం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

వైభవంగా తులసి సహిత నారాయణుల కల్యాణం



కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి శివారులోని షిరిడీ సాయి ప్రేమ మందిరంలో శుక్రవారం కార్తీకమాస క్షీరాబ్ది ద్వాదశి పుణ్యతిథిని పురస్కరించుకుని తులసి సహిత ధాత్రి నారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కార్తీక ఉసిరి వనభోజనాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు విజయ్‌కుమార్-మంజుల దంపతులు, కమిటీ ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

కామారెడ్డి పట్టణ పరిధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్షీర ద్వాదశి సందర్భంగా చిలుక దంచుట, తులసి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు రవికాంత్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుతో అవినీతి అంతం



వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న జంగంపల్లి ఉపసర్పంచ్, తదితరులు

- బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షులు అనిత

భిక్కనూరు: కామారెడ్డి నియోజకర్గంలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలుపుతో ఇప్పటివరకు కొనసాగుతున్న అవినీతి అక్రమాలకు అంతమవుతాయని బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షులు విశ్వనాథుల అనిత మహేష్ గుప్తా అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో ఆమె శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు ఇద్దరూ నాన్‌లోకల్ వారని వారు కేవలం ఎన్నికల కోసమే ఇక్కడికి వచ్చారన్నారు. వెంకటరమణరెడ్డి లోకల్ వ్యక్తి అని, ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకునే వ్యక్తి అన్నారు. బీజేపీ నాయకులు విశాలరెడ్డి, చంద్రకళ, వరలక్ష్మి, సంధ్య, నర్సింలు, ఉప్పరి రమేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ప్రజాప్రతినిధులు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి ఉపసర్పంచ్ భాస్కర్, సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహారెడ్డితో పాటు మరో 21 మంది బీజేపీలో శుక్రవారం చేరారు. వీరికి కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ.. నీతినిజాయితీ కోసం తనకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

బీఆర్‌ఎస్ పాలనలో కులమతాలకతీతంగా అభివృద్ధి



రాజంపేటలో మాట్లాడుతున్న గంపగోవర్ధన్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మద్దికుంట యువకులు



ఆహ్వానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

రాజంపేట: బీఆర్‌ఎస్ పాలనలోనే కులమతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం రాజంపేట మండల కేంద్రంతో పాటు పెద్దాయిపల్లి గ్రామాలలో సీఎం కేసీఆర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలిత ప్రాంతాలలో తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కంటే ముందు తెలంగాణను పాలించిన కాంగ్రెస్ తెలంగాణను ఎంత వరకు అభివృద్ధి చేసిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. కొన్ని పార్టీలు బీఆర్‌ఎస్ వస్తే ధరణి పోతదని, భూములు పోతాయని అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆందోళనకు గురి కావద్దన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు భిక్యాజి బల్వంతరావ్, వైస్ ఎంపీపీ దుబ్బని సావిత్రి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమితి సభ్యులు నల్లవెల్లి అశోక్, సర్పంచ్‌లు ఆముద సౌమ్య, శివవ్వ, ఉప సర్పంచ్ శివకుమార్, సీనియర్ నాయకులు బల్ల ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు చింతల స్వామి పాల్గొన్నారు.

కేసీఆర్ గెలిస్తే మరింత అభివృద్ధి

మాచారెడ్డి/కామారెడ్డి రూరల్: మళ్లీ సీఎం కేసీఆర్ గెలిస్తే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. శుక్రవారం మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు అక్కాపూర్, ఫరీదుపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఉప్పు లక్ష్మణ్, రాజయ్య, నర్సింలు ఉన్నారు. అలాగే కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మద్దికుంటకు చెందిన యువకులు శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గంప శశాంక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ రాంరెడ్డి, యాప సర్పంచ్ కమ్మిళ్ల నరేందర్, తదితరులు ఉన్నారు.

లింగాపూర్ 11వ వార్డులో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ 11వ వార్డులో సుమారు 50 మంది కాంగ్రెస్, బీజేపీలకు రాజీనామా చేసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు షానూర్, బండారి నర్సారెడ్డిల సమక్షంలో చేరారు.

దొడ్డి కొమురయ్య విగ్రహానికి భూమి పూజ



కామారెడ్డి రూరల్: లింగాయపల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పేద ప్రజల స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప త్యాగమూర్తి దొడ్డి కొమురయ్య అని, ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతామని కురుమ ప్రతినిధులు వెల్లడించారు. సర్పంచ్ దేమే అపర్ణ రవి, కురుమ సంఘం నేత మదిరె శివయ్య పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

- 5 నిమిషాల్లో సర్వసభ్య సమావేశం ముగింపు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఐదు నిమిషాల్లోనే ముగించారు. సభ్యుల కోరం ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల అభివృద్ధి అంశాలు తర్వాతి సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామని ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, మండల రైతు బంధు అధ్యక్షుడు భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం

- ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి



బీబీపేట: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, రైతన్నలకు పెద్ద పీట వేస్తూ వారిని ముందుకు తీసుకువెళ్తున్న కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కోనాపూర్, యాడారం, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత ప్రతి రంగంలో దేశంలోనే నంబర్ వన్‌గా ప్రగతిని సాధించుకున్నామని, మహిళలను గౌరవించుకుంటూ వారికి పెన్షన్లు, ఆడపిల్లల కోసం కల్యాణలక్ష్మి లాంటి పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజలందరు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రచారం



దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ లీగల్ సెల్ తరఫున అడ్వొకేట్లు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కేసీఆర్‌ను గెలిపించాలని వారు కోరారు. లీగల్ సెల్ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, భిక్షపతి, గంగాధర్, అన్వర్‌షరీఫ్, రత్నాకర్‌రావ్, సలీం, సంజీవ్‌రావ్ తదితరులు ఉన్నారు. మండల అధ్యక్షుడు మధుసూదన్ రావ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ ధర్నా



రాజంపేట: బంజారాల కులదైవం సేవాలాల్ మహరాజ్ ఫొటోను ఓ అభిమాని ఆయనకు బహుమతిగా అందజేస్తుండగా పక్కకు నెట్టి అవమానపరిచినందుకు శుక్రవాం కొండాపూర్ పరిధిలోని బంజారా సభ్యులు రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. అదే విధంగా నల్గొండ సభలో సైతం ఎస్టీలకు 30 సీట్లు ఇవ్వాలని కోరితే లంబాడీలకు గుడుంబా పోపిస్తే చాలు అని అవమానపరచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతలు బలరాం, జలరాం, సుభాష్, గుడితండా సర్పంచ్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి



మద్నూర్(జుక్కల్): బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని దన్నూర్, మద్నూర్, పెద్ద టాక్లీ, చిన్న టాక్లీ తదితర గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కేసీఆర్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తే ప్రపంచంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే హన్మంత్‌సింధేను ఈ సారి గెలిపిస్తే మన ప్రాంతం నుంచి మంత్రి పదవి దక్కడం ఖాయమన్నారు.

కొండల్‌రెడ్డితో కుర్మ సంఘాల ప్రతినిధుల భేటీ



కామారెడ్డి రూరల్: కామారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని శుక్రవారం మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి కుర్మ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొంగడి, రుమాలుతో సన్మానించారు. బీరప్ప ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. పనులు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. చేతి గుర్తుకు ఓటు వేసి రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చెట్కూరి గంగారాం, నాగల్ల రాజయ్య, మర్కంటి స్వామి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



బీబీపేట: జనగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, పారిశ్రామిక వేత్త తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నుండి జనగామ ఉపసర్పంచ్ గజ్జెల ఎల్లం, మాందాపూర్ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు , బీబీపేట వార్డు సభ్యులు, ఉప్పర్‌పల్లి గ్రామ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లుగా వారు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, జనగామ సర్పంచ్ పాతరాజు, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఎంపీపీ, అంబారీపేట ఎంపీటీసీ..



కామారెడ్డి టౌన్/దోమకొండ: భిక్కనూర్ ఎంపీపీ గాలిరెడ్డితో పాటు దోమకొండ మండలం అంబారిపేట్ గ్రామ ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్‌రావులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బెంగళూరు సిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యే రిజ్వాన్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోనె శ్రీను, గడ్డం చంద్రశేఖర్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కామారెడ్డి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి రేవంత్‌రెడ్డి తరఫున కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే 6 గ్యారంటీ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, హన్మాల గంగయ్య, ఆనంద్‌రావు ఉన్నారు.